సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025

ఇల్లెందులోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఇరవై ఏళ్ల క్రితం భద్రగిరిలో కరకట్ట నిర్మాణం

- రోడ్లు, బెంచీలకే అభివృద్ధి పరిమితం
- గోదావరి 'రివర్ ఫ్రంట్'తో సౌకర్యాలు..
- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఈ ట్రెండ్
- ఎలివేటెడ్ నిర్మాణంతో స్థల సమస్యకూ చెక్



నదీ తీరం.. సమస్యల నిలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పావన గోదావరి తీరాన భద్రాచల పుణ్యక్షేత్రం కొలువై ఉంది. సీతారాముల దర్శనానికి వచ్చే భక్తులు గోదావరి నదిలో స్నానం చేయడం తప్పనిసరిగా భావిస్తారు. ఇలా వందల ఏళ్లుగా భద్రాచలానికి భక్తులు వస్తున్నా.. ఇక్కడి గోదావరి తీరంలో మాత్రం భక్తులకు సరైన సౌకర్యాలు లేవు.

రక్షణ చర్యలకే పరిమితం..

వరదల నుంచి రక్షణ కోసం 20 ఏళ్ల క్రితం గోదావరి తీరం వెంట సుమారు ఏడున్నర కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించారు. ఇందులో గోదావరి వంతెన నుంచి పుష్కర ఘాట్ వరకు ఉన్న మూడున్నర కిలోమీటర్ల పొడవున కరకట్టపై సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారు. లైటింగ్, బెంచీలు అమర్చారు. కరకట్ట దిగువ భాగంలో రామాయణ ఇతివృత్తం తెలిపేలా బాపు బొమ్మలను ఏర్పాటు చేశారు. ఇక గత ఇరవై ఏళ్లుగా పుష్కరఘాట్ వద్ద స్నానఘట్టాలు పెంచడం మినహా కరకట్ట వెంబడి జరిగిన మరో అభివృద్ధి పని లేదు.

ఆకలేసినా.. అలసటొచ్చినా..

ఉదయం నుంచి ఉపవాసం ఉండి రామయ్య దర్శనం చేసుకున్న భక్తులు ఆర్తిగా గోదావరిని కళ్లారా చూసిన తర్వాత ఆకలేస్తే ఇక్కడ తినడానికి ఏమీ లభించవు. అలసట అయినా కూర్చునేందుకు కుర్చీలు ఉండవు. ఎర్రటి ఎండ, జడి వాన నుంచి రక్షణ కల్పించేందుకు ఇక్కడ నీడ లేదు. పట్టుపని పది నిమిషాలు కరకట్టపై నిల్చునే అవకాశం లేదు. సౌకర్యాల లేమితో భక్తులు మొక్కుబడిగా పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని వెళ్తున్నారు. గౌతమీ తీరంలో జరిగే తెప్పోత్సవం సందర్భంగా భక్తులు పడే పాట్లు అన్ని ఇన్నీ కావు. చివరకు గోదావరి హారతి వంటి ఆధ్యాత్మిక కార్యక్రమం కూడా సజావుగా సాగేలా తగిన ఏర్పాట్లు లేవు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కరకట్ట వెంట సౌకర్యాలు కల్పించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

రివర్ ఫ్రంట్ ట్రెండ్


నదీ తీరంలో వెలిసిన కాశీ (వారణాసి) లాంటి ఆధ్యాత్మిక నగరాలు మొదలు అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి మెట్రో సిటీల్లో రివర్ ఫ్రంట్ పేరుతో నదుల వెంట అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రజలకు అహ్లాదాన్ని పంచేలా పార్కులు, థియేటర్లు, ఫుడ్ కోర్టులు, యోగా సెంటర్లు, వాకింగ్ ట్రాక్, ఎగ్జిబిషన్ సెంటర్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. భద్రాచలం విషయానికి వస్తే గత 20 ఏళ్లుగా ఇక్కడ గోదావరి తీరం వెంట ఇటు భక్తులు, అటు పుర ప్రజలు, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా, ఈ పట్టణానికి ఉన్న ఆధ్యాత్మిక శోభను పెంచేలా ఎలాంటి అభివృద్ధి జరగలేదు.

మల్టీ పర్పస్‌గా..

గోదావరి కరకట్ట దిగువ భాగం నుంచి పిల్లర్ల ద్వారా కరకట్ట ఎత్తు వరకు శ్లాబ్ నిర్మించి, ఆ తర్వాత భక్తులు, పర్యాటకులకు అవసరమైన వివిధ సౌకర్యాలు కల్పించాలి. ఈ ఎలివేటెడ్ నిర్మాణాల పైనుంచి గోదావరి నదిని చూడటం భక్తులకు, పర్యాటకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవడంతో పాటు భద్రాద్రిలో వ్యాపార రంగం కూడా పుంజుకుంటుంది.

స్థల సమస్య తీరేలా..

రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలం పట్టణాన్ని స్థల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టలన్నా అందుబాటులో ఉన్న కొద్ది పాటి స్థలమే దిక్కు. దీంతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న స్థలాన్నే బహుళార్థకంగా ఉపయోగించే ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగా కరకట్ట వెంబడి ఎలివేటెడ్ కాటేజీలు, ఫుడ్‌కోర్టు, రిక్రియేషన్ జోన్, బోటింగ్ పాయింట్, సెల్ఫీ పాయింట్ తదితర సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. నగరాల్లో ఎలివేటెడ్ మెట్రోలు, రోడ్లు నిర్మించిన పద్ధతిలోనే కరకట్ట దిగువ భాగం నుంచి ఎలివేటెడ్ పద్ధతిలో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా సరికొత్త నిర్మాణాలను చేపట్టాల్సిన అవసరం ఉంది.



భక్తిశ్రద్ధలతో రంజాన్

ఈద్గాల్లో సామూహిక ప్రార్థనలు



నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్ష ఆచరించిన ముస్లింలు రంజాన్(ఈద్ ఉల్ ఫితర్) పండుగను సోమవారం భక్తిశ్రద్ధ లతో జరుపుకున్నారు. ఉదయమే సమీపంలోని ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్త బోధనలు వినిపించిన మత పెద్దలు.. పేదలకు సాయం చేయాలని సూచించారు. ఇల్లెందు, అశ్వారావుపేట, కొత్తగూడెం ఈద్గాలను సందర్శించిన స్థానిక ఎమ్మెల్యేలు ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

9లో



చండ్రుగొండ: ఈద్ విశిష్టతను వివరిస్తున్న మత పెద్ద



భద్రాచలం ఏఎంసీ కాలనీలో ముస్లింల ప్రార్థనలు

కార్పొరేట్ హెచ్ఆర్‌డీ జీఎంగా రఘుపతి



రఘుపతి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఆర్జీ–3 ఏరియా ఎస్ఓ టు జీఎంగా విధులు నిర్వర్తిస్తున్న జి.రఘుపతికి పదోన్నతి లభించింది. ఆయనను కొత్తగూడెం కార్పొరేట్ హెచ్ఆర్‌డీ జీఎంగా నియమిస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో హెచ్ఆర్‌డీ జీఎంగా పనిచేసిన హబీబ్ హుస్సేన్ సోమవారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో రఘుపతిని నియమించారు. అలాగే, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎం బానోత్ సైదులును సింగరేణి ఫారెస్ట్ జీఎంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఫారెస్ట్ జీఎంగా ఉన్న వివేక్‌బాబు రిటైర్ కావడంతో ఈ బదిలీ జరిగింది.

యువ వికాసంపై విస్తృత అవగాహన

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాజీవ్ యువ వికాస పథకంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ పథకానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్హులంతా దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ఎంపీడీఓ కార్యాలయాల్లో అందజేస్తే.. వాటిని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన హెల్ప్ డెస్కుల ద్వారా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నట్లు వివరించారు. వీసీలో సంక్షేమాధికారులు ఇందిర, సంజీవరావు, ఉపేందర్, అనసూయ, మెప్మా పీడీ రాజేష్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్

దరఖాస్తులు పెరిగేలా చర్యలు

భద్రాచలంటౌన్: రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ పథకానికి ఎక్కువ మంది గిరిజన యువకులు దరఖాస్తులు చేసుకునేలా గ్రామాల్లో ప్రచారం కల్పిస్తున్నామని, ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఆయన వెంట ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

పరమశివుడికి లక్ష బిల్వార్చన



శివయ్యకు లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన సోమవారం అమ్మవారి ఆలయ సన్నిధిలో గల శివాలయంలో స్వామివారికి లక్ష బిల్వార్చన, శ్రీచక్రార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆ తర్వాత నాదనీరాజనం, సూక్తి పారాయణం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం గావించారు. అనంతరం అమ్మవారికి లక్ష కుసుమార్చన, శ్రీలలితా సహస్రనామ హవనం నిర్వహించారు. మంత్రపుష్పం పఠించి అమ్మవారికి హారతి సమర్పించారు.

కిన్నెరసానిలో రంజాన్ సందడి

ఒకరోజు ఆదాయం రూ.33,705



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యాటకులు సందడి చేశారు. మండల పరిధిలోని కిన్నెరసానికి సోమవారం జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చి డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 471 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.16,355 ఆదాయం లభించగా, 350 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.17,350 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

వైద్యరంగంలో నర్సుల పాత్ర కీలకం

- డాక్టర్లు దేవుళ్లతో సమానం
- నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవంలో సింగరేణి సీఎండీ బలరామ్



నర్సింగ్ కళాశాలను ప్రారంభిస్తున్న సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం) : వైద్య రంగంలో నర్సుల పాత్ర ఎంతో కీలకమని, ప్రస్తుత సమాజంలో వారికి ఉన్న గుర్తింపు మరెవరికీ లేదని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అన్నారు. వైద్య వృత్తి ఎంతో విలువలతో కూడుకుందని, భగవంతుడు ప్రాణమిస్తే.. ఆ ప్రాణాలను నిండు నూరేళ్లు కాపాడేది వైద్యులేనని చెప్పారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో రూ.3.46 కోట్లతో ఆధునికీకరించిన నర్సింగ్ కళాశాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒక పేషెంట్ ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి డిశ్చార్జ్ అయ్యేవరకు నర్సులే ఎంతో అంకిత భావంతో సేవలందిస్తుంటారని, కొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యుల కంటే కూడా ఎక్కువగా సేవ చేస్తారని కొనియాడారు. కొత్తగూడెంలోని సింగరేణి ఆస్పత్రి పాత భవనంలో ఈ కోర్సును 1960లో ప్రారంభించామని, 2010లో గోల్డెన్ జూబ్లీ నిర్వహించామని గుర్తు చేశారు. ఈ కళాశాలలో ఇప్పటివరకు 850 మంది నర్సింగ్ కోర్సు పూర్తి చేశారని, వారిలో 500 మంది నర్సులు సింగరేణి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తుండగా, 200 మంది వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్నారని చెప్పారు. మరో 150 మంది విదేశాల్లో, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పని చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 54 మంది చదువుతున్నారని, జీఎన్ఎం నర్సింగ్ కోర్సు అందుబాటులో ఉందని చెప్పారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు కూడా ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. నాణ్యమైన నర్సింగ్ విద్య అందించడమే సంస్థ లక్ష్యమన్నారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు సింగరేణి ప్రధానాస్పత్రి సహా అన్ని ఏరియాల ఆస్పత్రులను ఆధునికీకరిస్తామని తెలి పారు. సంస్థకు చెందిన డాక్టర్లు, నర్సులు, ఉద్యోగులు దృఢ నిశ్చయంతో పనిచేయాలని, పేషెంట్లను ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయకుండా సాధ్యమైనంత వరకు ఇక్కడే వ్యాధిని నయం చేయాలని కోరారు. త్వరలో సీటీ, ఎంఆర్ఐ స్కాన్‌ను ప్రారంభిస్తామని ప్రకటించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన సీఎంఓ సుజాతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సత్యనారాయణ రావు, సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మ్యూజియం ఆకట్టుకోవాలి


ఐటీడీఏ పీఓ రాహుల్ సూచన



అధికారులకు సూచనలు చేస్తున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: పర్యాటకులను ఆకట్టుకునేలా గిరిజన మ్యూజియాన్ని తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మ్యూజియంలో ఏర్పాటుచేసిన వివిధ కళాఖండాలు, పెయింటింగ్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాతకాలపు ఇళ్ల వలె తీర్చిదిద్దిన వాటిలో సందర్శకులు కూర్చునేందుకు కుర్చీలు, టేబుళ్లు ఏర్పాటుచేయాలని సూచించారు. గిరిజన తెగలకు సంబంధించిన సంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఆర్ఓ ప్లాంట్, రిసెప్షన్ కౌంటర్ ఉండాలని, మ్యూజియం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, అధికారులు వేణు, ప్రభాకర్‌రావు, గోపాలరావు, శ్రీనివాస్, రవి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలానికి పాదయాత్రగా రామభక్తులు



భద్రాచలం వెళ్తున్న రామభక్తుల బృందం

అశ్వారావుపేటరూరల్: పాదయాత్రగా తరలివెళ్తున్న రామభక్తుల బృందం సోమవారం అశ్వారావుపేటకు చేరింది. ఏపీలోని ఏలూరు జిల్లా వేగవరం బీసీ కాలనీకి చెందిన రామభక్తులు పాదయాత్రగా భద్రాచలం రామాలయానికి తరలి వెళ్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ.. ప్రతి ఏటా శ్రీరామ నవమికి పాదయాత్రగా ఆలయానికి వెళ్లడం ఆనవాయితీ వస్తోందన్నారు. కాగా, అశ్వారావుపేటకు చేరిన భక్తులను స్థానికులు స్వాగతం పలికారు.

పంపిణీకి 'సన్న'ద్ధం

- రేషన్ షాపులకు చేరిన సన్న బియ్యం
- నేటి నుంచి లబ్ధిదారులకు సరఫరా
- నిల్వ ఉన్న దొడ్డు బియ్యం సంగతేంటో..?
- జిల్లా గోదాముల్లో 3,700 మెట్రిక్ టన్నుల స్టాక్



రామవరంలోని ఓ రేషన్ షాపులో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

కొత్తగూడెంఅర్బన్ /పాల్వంచరూరల్ : రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీకి అధికారులు చర్యలు చేపడుతున్నారు. వారం రోజుల క్రితమే గోడౌన్లకు సన్నబియ్యం చేరుకోగా మంగళవారం నుంచి సరఫరా చేయనున్నారు. జిల్లాలో 443 రేషన్ షాపులు ఉండగా ఆహార భద్రత కార్డులు 2,72,112, అంత్యోదయ కార్డులు 21,148, అన్నపూర్ణ కార్డులు 3, కొత్తకార్డులు 1,203 మొత్తం 2,93,263 కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డుదారులకు ఒక్కొక్కరికి నెలకు 6 కేజీలు, అన్నపూర్ణ కార్డుదారులకు పది కేజీలు, అంత్యోదయ కార్డు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 30 కేజీల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు.

పాత స్టాక్ ఏం చేస్తారు..

ప్రతీనెల 15వ తేదీ వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా రేషన్ దుకాణాలకు కోటా కేటాయింపు, తరలింపులో జాప్యం జరగడంతో పలు షాపుల్లో దొడ్డు బియ్యం నిల్వలు మిగిలిపోయాయి. ప్రస్తుతం రేషన్ దుకాణాలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. అయితే పాత, కొత్త బియ్యం బస్తాలు కలిసిపోతే లబ్ధిదారులకు అన్యాయం జరగనుంది. కొందరు డీలర్లు కావాలనే లబ్ధిదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేసే ప్రమాదం కూడా ఉంటుంది. జిల్లాలో ఆదివాసీలు, నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండడంతో వారు డీలర్లను నిలదీసి అడిగే పరిస్థితి ఉండదు. ఈ విషయంలో పౌరసరఫరాల శాఖ అధికారులే పటిష్ట తనిఖీలు చేపట్టి అందరికీ సన్నబియ్యం అందేలా చూడాల్సిన అవసరం ఉంది. అయితే గత నెలలో మిగిలిన 1036 మెట్రిక్ టన్నుల బియ్యం ఏం చేయాలనే విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సూచనలు రాకపోవడంతో ప్రస్తుతం రేషన్‌షాపుల్లోనే నిల్వ ఉంచారు. వీటికి తోడు సివిల్ సప్లై గోదాముల్లో మరో 3,700 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వ ఉన్నాయి.

అక్రమ దందాకు చెక్..

గత నెల వరకు రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యం మాత్రమే పంపిణీ చేసేవారు. దీంతో కొందరు కార్డుదారులు ఆ బియ్యం తినలేక వ్యాపారులకు విక్రయించేవారు. కొన్ని చోట్ల డీలర్లే వాటిని కొనుగోలు చేశారు. వ్యాపారులు, డీలర్లు మిల్లర్లతో కలిసి వాటిని తిరిగి మర ఆడించి మార్కెట్‌లో అధిక ధరలకు అమ్మేవారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ అక్రమ దందాకు తెర పడే అవకాశం ఉంది.

కొనసాగుతున్న కొత్త కార్డుల ప్రక్రియ..

జిల్లాలో ఇటీవల జరిగిన గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తు చేసుకున్న వారికి నూతన కార్డుల జారీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. గత జనవరిలో 1,203 కార్డులు కొత్తగా జారీ చేయగా, వారికి ఫిబ్రవరి నుంచి బియ్యం అందిస్తున్నారు. ఇంకా 34 వేలకు మందికి కార్డులు జారీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్ కార్డే ప్రామాణికం కావడంతో కార్డు లేని వారు అనేక సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నారు.

సన్నబియ్యం సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలోని రేషన్‌షాపుల ద్వారా అందించే సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ బియ్యం తీసుకోవాలి. కొత్త కార్డుల జారీ ప్రక్రియ కూడా కొనసాగుతోంది.

– రుక్మిణి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ఆదేశాలు వస్తేనే తరలిస్తాం

గోదాముల్లో 3,700 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకు ఈ బియ్యం అలాగే నిల్వ ఉంచుతాం. ఈనెల నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఇస్తున్నందున అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– త్రినాథ్‌బాబు, పౌరసరఫరాల శాఖ డీఎం

ఇల.. పసుపు కమ్మేసిందిలా!



దుమ్ముగూడెం మండలంలోని నడికుడి – రేగుబల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారి పక్కనే ఓ రైతు పదెకరాల్లో సాగు చేసిన జనుము తోట పూత దశకు చేరుకుంది. పూలన్నీ పసుపు వర్ణంతో ఉండడంతో నేలకు పసుపు పందిరి వేసినట్టుగా కనిపిస్తోంది. దీంతో రహదారి మీదుగా ప్రయాణిస్తున్న వాహనదారులు ఈ తోటను ఆసక్తిగా తిలకించడమే కాక ఇక్కడ ఆగి సెల్ఫీలు దిగి ముందుకు సాగుతున్నారు.

– దుమ్ముగూడెం

క్లుప్తంగా

ఛత్తీస్‌గఢ్‌లో 15 మంది మావోల అరెస్టు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుక్మా జిల్లాల్లో సోమవారం 15 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్‌లో ఆరుగురిని, ఊసూరు పోలీస్‌స్టేషన్‌లో టేకుమెట్లకు చెందిన ఏడుగురినే కాక సుక్మా జిల్లాలోని జేగురుగొండలో ఇద్దరిని అరెస్టు చేశారు. మొత్తంగా 15 మందిని అరెస్టు చేయగా వీరిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు వెల్లడించారు.

'కోర్ట్' సినిమా హీరోకి సత్కారం


రోషన్‌ను సత్కరిస్తున్న శ్రీనివాస్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన యువకుడు, కోర్ట్ సినిమాలో హీరోగా నటించిన రోషన్‌ను పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ సోమవారం సత్కరించారు. హైదరాబాద్‌లోని శ్రీనివాస్ నివాసానికి వచ్చిన రోషన్‌కు అభినందనలు తెలిపి చిత్ర పరిశ్రమలో రాణించాలని ఆకాంక్షించారు. కాగా, హీరో రోషన్ తండ్రి భద్రాచలంలో ఒక కాంట్రాక్టర్ వద్ద అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు.

ప్రార్థనలకు రాజకీయ నాయకులు వద్దు..

- మాజీ మంత్రి పాల్గొనడంపై ముస్లింల అభ్యంతరం
- కాంగ్రెస్ నేతల ఉపన్యాసాలకూ అడ్డు


ప్రార్థన మధ్యలో బయటకు వెళ్తున్న మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మం అర్బన్: రంజాన్ సందర్భంగా ఖమ్మం గొల్లగూడెం ఈద్గా వద్ద సోమవారం పెద్దసంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అయితే, ప్రార్థనలో ముస్లింలతో పాటు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొనడంపై పలువురు అభ్యంతరం తెలిపారు. ప్రార్థనలో హిందువులు పాల్గొనవద్దని, పక్కన ఏర్పాటుచేసిన టెంట్ కింద కూర్చుని ప్రార్థన ముగిశాక శుభాకాంక్షలు తెలపాలని అన్నారు. దీంతో పువ్వాడ సమీపంలోని టెంట్ వద్దకు చేరుకుని, ఆతర్వాత ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపి వెళ్లిపోయారు. కాగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రార్థన ముగిశాక ఈద్గాకు వచ్చి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అయితే, అక్కడ మిగిలి ఉన్న వారిని ఉద్దేశించి తుమ్మల సమక్షాన ముస్లిం నాయకులు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించే ప్రయత్నం చేయబోగా పలువురు అడ్డుచెప్పారు. పవిత్రమైన రంజాన్ పండుగ ప్రార్థనలో రాజకీయ ప్రసంగాలు చేయొద్దని సూచించారు.

అర్చక, ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: దేవాదాయ శాఖ పరిధిలోని అర్చకుల, ఉద్యోగ డైరీని సోమవారం ఖమ్మం కమాన్‌బజార్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందరశర్మ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 16,062 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక, ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదిక అందించామని తెలిపారు. దీంతో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కాగా, అర్చక, ఉద్యోగులు ఐక్యమత్యంతో ఉంటూ ఆలయాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీఎస్.శ్రీనివాసాచారి, అర్చకులు శేషభట్టర్ రఘునాథాచార్యులు, కాండూరి మధుసూదనాచార్యులు, వేణుగోపాలాచార్యులు, శేషభట్టార్ వెంకటాచార్యులు, ఉద్యోగులు కొండకింది వేణుగోపాలాచార్యులు, దయాకర్, బురాన్ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతో మేలు

ఏన్కూరు: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం ద్వారా పాలన కుంటుపడకపోగా నిధులు ఆదా అవుతాయని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరు రమేష్ అన్నారు. ఏన్కూరులో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వన్ నేషన్ – వన్ ఎలక్షన్' విధానాన్ని 32పార్టీలు సమర్థిస్తే కాంగ్రెస్ సహా ఇంకొన్ని పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని పేర్కొన్నారు. దీంతో ఈ విధానం వల్ల జరిగే మేలును ప్రజలకు వివరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసమావేశంలో నాయకులు నల్లమోతు రమేష్, నరుకుళ్ల వెంకటేశ్వర్లు, మాళ్ల అంజి, చింతలబోయిన వెంకటేశ్వర్లు, మల్లెం రవి పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.20,871

శంకుస్థాపనే తరువాయి..

- మాడ వీధుల విస్తరణకు లైన్ క్లియర్
- భద్రగిరిలో భూ, ఇళ్ల నిర్వాసితులకు చెక్కుల పంపిణీ
- నవమి రోజున పనుల ప్రారంభానికి సన్నాహాలు
- చిరు వ్యాపారస్తులనూ ఆదుకోవాలని వేడుకోలు


భద్రాచలంలో మాడ వీధుల విస్తరణలో భాగంగా తొలగనున్న దుకాణాలు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనే తరువాయి అన్నట్లుగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయ అభివృద్ధికి ఇచ్చిన హామీ మేరకు రూ.60 కోట్లలో భూ, ఇళ్ల నిర్వాసితులకు రూ.35 కోట్లను తొలివిడతగా విడుదల చేయగా.. అట్టి నిధులను ఇటీవల నిర్వాసితులకు నష్టపరిహారం కింద చెక్కులు అందించారు. ఇందులో మొత్తంగా 40 కుటుంబాలకు రూ.34,45,86,000లను అందించారు. అభివృద్ధిలో భాగంగా మాడ వీధుల విస్తరణలో ఉన్న తొలి అడ్డంకి తొలగిపోవడంతో ఈనెల 6వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రెండు రోజులు ఆలస్యం..

కల్యాణ మహోత్సవానికి ఆహ్వానించడానికి వెళ్లిన రోజునే సీఎం నిధుల విడుదలకు హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం సుమారు రూ. 35 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేసి పనుల ప్రారంభానికి సన్నాహాలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అయితే బుధవారం నిర్వాసితులకు నష్టపరిహారం చెక్కులను అందజేయాల్సి ఉన్నప్పటికీ ఇటీవల భద్రాచలంలో జరిగిన బహుళ అంతస్తు భవనం కూలిన దుర్ఘటనతో ఆగిపోయింది. ఆర్డీఓతో సహా అధికారులందరూ శిథిలాల తొలగింపులో ఉండడంతో రెండు రోజులు ఆలస్యమైంది.

6న శంకుస్థాపనకు సన్నాహాలు

విస్తరణలో కీలక ఘట్టమైన భూ సేకరణకు లైన్ క్లియర్ కాగా 6న ఆలయ అభివృద్ధి, మాడ వీధుల విస్తరణకు శంకుస్థాపన జరిగే అవకాశం ఉంది. దీనికి అనుగుణంగా మంత్రులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారు. అయితే నవమి రోజున సీఎం అభివృద్ధి మాస్టర్‌ప్లాన్, కేటాయించిన నిధులపై కీలక ప్రకటన చేయాల్సి ఉంది. ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, ప్లాన్‌లను ఆలయ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. కాగా, నిధులు విడుదల చేసిన సీఎంకు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాపారస్తుల వినతి..

ఆలయ అభివృద్ధి, మాడవీధుల విస్తరణలో భాగంగా బొమ్మల దుకాణాలు, ఇతర చిరు వ్యాపారాలు తొలగిస్తుండడంతో తమ కుటుంబాలు వీధిన పడతాయని బాధిత వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఆర్డీఓ దామోదర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. నష్టపరిహారం తమకు సైతం అందజేయాలని వినతిపత్రంతో పేర్కొనడంతో తగిన న్యాయం చేసేలా చూస్తానన్నారు. అంతేకాక ఆలయ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కాగా, శ్రీరామనవమి ఉత్సవాల వరకు వీటిని తొలగించే అవకాశం లేదని, ప్రభుత్వ గైడెన్స్ ప్రకారం తర్వాత తొలగింపు ఉంటుందని వారు పేర్కొంటున్నారు.


ఎమ్మెల్యేకు తమ గోడు తెలుపుకుంటున్న చిరు వ్యాపారస్తురాలు(ఫైల్)

'సీతారామ'పై వాస్తవాలు వెల్లడించాలి

ప్రాజెక్టు పూర్తికాకుండానే జలాల తరలింపు

సింగరేణి(కొత్తగూడెం): సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాస్తవాలు వెల్లడించాలని, జిల్లా రైతాంగానికి సాగునీరు ఇవ్వకుండా తరలించే కుట్రలను సీపీఎం చూస్తూ ఊరుకోబోదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని మంచికంటి భవన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తీసుకొచ్చినట్లు చెబుతుండడంతో భద్రాద్రి జిల్లా రైతాంగంలో ఆందోళన నెలకొందన్నారు. ఇటీవల తాము కుమ్మరిగూడెం నుంచి జూలూరుపాడు వరకు ప్రాజెక్ట్ పంప్ హౌజ్‌లు, కాల్వలను పరిశీలించామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి కాకపోగా, నదికి గండి కొట్టించి నీటిని సీతారామ కాల్వకు మళ్లించినట్లు గుర్తించామన్నారు. ఫలితంగా హెవీవాటర్ ప్లాంట్, మిషన్ భగీరథ, సింగరేణి అవసరాల కోసం నిల్వ చేసిన జలాలు అడుగంటాయని చెప్పారు. అంతేకాక గోదావరి జలాలు భద్రాద్రి జిల్లా రైతాంగానికి ఇవ్వడానికి ఎలాంటి పనులు చేపట్టకపోగా, భద్రాచలం, పినపాక, కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాలకు నీరు అందకుండా డిజైన్ మార్చారని ఆరోపించారు. మొత్తంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కాకుండా గోదావరి జలాలను ఆంధ్రా ప్రాంతానికి తరలించే కుట్ర దాగి ఉందని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఏ.జే.రమేష్, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, భూక్యా రమేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, పక్కన నాయకులు

కోటమైసమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కారేపల్లి: కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన శ్రీ కోటమైసమ్మ తల్లి ఆలయంలో బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. బుధవారం జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభిరామారావు నేతృత్వాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాశశర్మ, వేద పండితులు కొనమంచలి ఫణికుమార్ శర్మ తొలిరోజు మృత్యుంజయ అమృత పాశుపతం హోమం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే, ఇల్లెందు మార్గదర్శి స్కూల్ ప్రతినిధులు అర్వపల్లి రాధాకృష్ణ, వేణుగోపాల్ గుప్తా సహకారంతో ఏర్పాటుచేసిన అన్నదానాన్ని దేవాదాయ, ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.వీరస్వామి ప్రారంభించారు. ఆలయ ఉద్యోగులు పగడాల మోహన్‌కృష్ణ, పర్సా లలిత్‌సాయి తదితరులు పాల్గొన్నారు.


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వీరస్వామి

వక్ఫ్ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది..

ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా అమలు చేసేందుకు యత్నిస్తున్న వక్ఫ్ బిల్లును కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. సోమవారం ఈద్గాలో ముస్లింలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ముస్లింలకు తరతరాలుగా స్థిర ఆస్తిగా ఉన్న భూములను అన్యాక్రాంతం చేసే ఉద్దేశంతోనే కేంద్రం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. వక్ఫ్ భూములపై కేంద్రం బిల్లు ఆమోదించుకున్నా.. తమిళనాడు ప్రభుత్వం తరహాలో రాష్ట్రంలోనూ కొనసాగేంచేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే వారి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటిమాదిరిగానే హిందూముస్లింలు సోదర భావంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ఇనాయితుల్లా, ఇబ్రహీం, ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు పులి సైదులు, రాము మహేష్, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకనయ్య

120 కిలోల బెల్లం పట్టివేత

ఇద్దరిపై కేసు నమోదు

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులోని ఓ కిరాణ దుకాణం, ఇంటిపై ఎక్సైజ్‌శాఖ పోలీసులు సోమవారం దాడులు చేశారు. కిరాణ దుకాణం నిర్వాహకుడు మణికంఠ నాటు సారా తయారీకి వినియోగించే బెల్లం, పటిక విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్‌శాఖ కొత్తగూడెం సీఐ ఎల్.జయశ్రీ ఆధ్వర్యాన పోలీసులు దాడి చేశారు. దీంతో మణికంఠ జూలూరుపాడుకు చెందిన ఎం.సుమన్ ఇంట్లో బెల్లం, పటిక, నాటు సారా నిల్వ చేశారని పోలీసులు గుర్తించి 120 కిలోల బెల్లం, 25 కిలోల పటిక, 2.5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. మణికంఠ, సుమన్‌లను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీహరి, హెడ్ కానిస్టేబుళ్లు ప్రకాష్‌రావు, ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బెల్లం, పటికతో ఎక్సైజ్ పోలీసులు

పోలీసుల అదుపులో 'బియ్యం' లారీ

పాల్వంచరూరల్: రేషన్ బియ్యం తరలిస్తున్నారనే అనుమానంతో సోమవారం ఎస్‌ఐ సురేశ్ ఆధ్వర్యాన మండల పరిధిలోని పెద్దమ్మగుడి ఎదుట నిలిపి ఉన్న ఒక లారీ, డీసీఎం వాహనాలను తనిఖీ చేశారు. దీంతో నూకలు, బియ్యం తవుడు లభించగా.. ఇవి రేషన్ బియ్యమా లేక ఇతర బియ్యమా అనేది స్పష్టత లేకపోవడంతో ఆ రెండు వాహనాలను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాటిని సివిల్‌సప్లయీస్ అధికారులకు పంపి పరీక్షించాక చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత..

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాలలో గోదావరి నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. సీఐ అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు ఇసుక ట్రాక్టర్ పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.


పోలీసుల అదుపులో పట్టుబడిన లారీ

రంజాన్ వేళ విషాదం

- చెరువులో మునిగి తండ్రీకుమారుడి మృతి
- తండ్రిని రక్షించే క్రమాన కుమారుడు కూడా కన్నుమూత

బోనకల్: ముస్లింలంతా రంజాన్ పండుగను ఘనంగా జరుపుకుంటుండగా ఆ కుటుంబంలో మాత్రం విషాదం నెలకొంది. చెరువులోకి దిగిన తండ్రిని కాపాడే యత్నంలో కుమారుడు కూడా గుంతలో చిక్కుకుని మృతి చెందిన ఘటన బోనకల్ మండలం ఆళ్లపాడు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.... ఆళ్లపాడుకు చెందిన పఠాన్ యూసుఫ్ ఖాన్(72)కు మతిస్థిమితం సక్రమంగా ఉండడం లేదు. సోమవారం ఉదయం వారి ఇంటి ఎదురుగా ఉన్న చెరువులోకి ఓ గేదె వెళ్లడాన్ని చూసిన ఆయన సైతం దిగాడు. ఈ విషయాన్ని గమనించిన యూసుఫ్ పెద్ద కుమారుడు కరీముల్లా(45) తండ్రిని బయటకు తీసుకురావడానికి చెరువులోకి దిగాడు. అయితే, ఆయనకు ఈత రాకపోవడంతో ఇద్దరూ చెరువులో గత ఏడాది మట్టి తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో చిక్కుకున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామస్తులు వారిని రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోగా నీట మునిగి మృతి చెందారు. దీంతో పండుగ వేళ నెలకొన్న విషాదంతో వారి కుటుంబీకుల రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి. యూసఫ్ ఖాన్‌కు భార్య, ముగ్గురు కుమారుల ఉండగా, కరీముల్లాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, ఆళ్లపాడు చెరువులో గతంలోనూ ముగ్గురు మృతి చెందగా, ప్రస్తుత ఘటనతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.



పఠాన్ యూసుఫ్ ఖాన్ (ఫైల్) కరీముల్లా (ఫైల్)

పేరుకే సెంట్రల్‌పార్క్..!

జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ పార్క్ సందర్శకులకు నిరాశే మిగిలిస్తోంది. సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచేలా దీన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అయితే, పార్క్‌లో సైక్లింగ్, బోటింగ్, సఫారీ వాహనాలు పడకేశాయి. దీంతో పార్క్‌లో కలియదిరిగే వీలు లేకపోగా.. సైక్లింగ్ కూడా జరగడం లేదు. చెరువులో నీరు లేక బోటింగ్ చేయలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా పార్క్‌కు వచ్చే వారు ఇవన్నీ చూసి చేసేదేం లేక తిరిగి వెళ్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం


నీరు లేక చెరువులోనే నిలిపిన బోట్లు


పార్క్‌లో నిరుపయోగంగా సైకిళ్లు


ఉపయోగంలో లేని సఫారీ వాహనం

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆటో..


దెబ్బతిన్న ఆటో

కొత్తగూడెంటౌన్: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కొత్తగూడెం వన్ టౌన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలను స్థానికులు, పోలీసులు ఇలా తెలిపారు. రామవరంకు చెందిన ఆటో డ్రైవర్ పాషా కొత్తగూడెంకు వెళ్తుండగా గోదుమవాగు దాటాక ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో ఆటో పూర్తిగా దెబ్బతినగా.. పాషాతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి ఇద్దరు మద్యం మత్తులో ఉన్నారని, వారి తలకు, ముఖానికి గాయాలై ఖమ్మం ఆస్పత్రికి వెళ్లినట్లు తెలిపారు. అయితే లారీ డ్రైవర్ వద్ద పాషా తాళం తీసుకెళ్లారని లారీడ్రైవర్ పోలీసులకు చెప్పారు.

డీసీసీబీ మాజీ చైర్మన్‌కు తప్పిన ప్రమాదం

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణంకు ప్రమాదం తప్పింది. ఖమ్మం నుండి సత్తుపల్లికి ఆయన కారులో వెళ్తుండగా వీ.వీ.పాలెం వద్ద ఖమ్మం- వైరా ప్రధాన రోడ్డులో గేదె అడ్డుగా వచ్చింది. ఆ గేదెను తప్పించే క్రమాన దాన్ని ఢీకొట్టడంతో నాగభూషణం, కారులో ఉన్న మాజీ రెవెన్యూ ఉద్యోగి లింగయ్యకు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు మాత్రం ముందు భాగం ధ్వంసం కాగా, గేదె మృతి చెందింది. ఈమేరకు నాగభూషణంను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్ తదితరులు పరామర్శించగా మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రమాదంపై ఫోన్‌లో ఆరా తీశారు.


దెబ్బతిన్న కారు, ఎదురుగా మృతి చెందిన గేదె

250 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కామేపల్లి: అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సాయి కుమార్ తెలిపి న వివరాలు... మండలంలోని పండితాపురం గ్రామానికి చెందిన ఓ వ్యాపారి శనివారం రాత్రి లారీలో బియ్యాన్ని లోడ్ చేసి తరలించేందుకు సిద్ధమవుతున్నాడనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈమేరకు 250క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకోగా, వాహనంతో సహా సివిల్ సప్లయీ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.


పట్టుబడిన బియ్యం లారీ, డ్రైవర్‌తో పోలీసులు

బొల్లేరుగూడెంలో చోరీ

పాల్వంచ: తాళం వేసి ఆస్పత్రి వెళ్లిన ఉన్న ఓ వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. పట్టణంలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను స్థానికుల ఇలా తెలిపారు. బొల్లేరుగూడెంకు చెందిన రవితేజ ఆరోగ్యం బాగోలేక గత పది రోజుల క్రితం ఖమ్మం ఆస్పత్రికి వెళ్లాడు. తిరిగి సోమవారం ఇంటికి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఉండడంతో లోపకి వెళ్లి పరిశీలించగా.. ఇంట్లో బీరువాలోని రూ.లక్ష నగదు, 20 తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. కాగా, ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

రెండు బైకులు ఢీ..

ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

దమ్మపేట : ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు కథనం ప్రకారం .. మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన పాయం వెంకటేశ్వరరావు (50) వ్యవసాయ బోర్లకు సంబంధించిన పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మల్కారంలో వ్యవసాయ బోరు రిపేరు ఉందంటే వెళ్లి పని ముగించుకుని తిరిగి తన బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. అలాగే సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై దమ్మపేట గ్రామంలోని బంధువుల ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో కొమ్ముగూడెం గ్రామ శివారులో ఈ రెండు బైకులు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన పాయం వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. కాకర్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు గాయాలు కాగా వారిని సత్తుపల్లికి తరలించారు. మృతుడు పాయం వెంకటేశ్వరరావుకు భార్య వెంకటమ్మతో పాటుగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా..పెద్ద కుమార్తెకు వివాహమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.